గురువారం 14 డిసెంబర్ 2023 రాజన్న సిరిసిల్ల





# ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు

**● మార్చి14 వరకు పొడిగింపు ● మార్పులు, చేర్పులకు అవకాశం**

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 13 : ఆధార్ అప్‌డేట్ గడువును మరోసారి పొడిగించారు. వయసు పెరుగుతున్నకొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. కాగా, ఆధార్ కార్డు వివిధ అవసరాలకు ప్రామాణికమవుతోంది. దీంతో వ్యక్తులను గుర్తించడం కష్టమవుతుండగా, అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డులోని వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటని పరిష్కరించే క్రమంలో ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ యూఐడీఏఐ అవకాశం కల్పించింది. గతేడాది డిసెంబర్ నుంచి మూడు మాసాల పాటు ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చంటూ ప్రకటించింది. అయితే కార్డుదారులు అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో ఆశించిన మేర మార్పులు చేసుకోలేదు. దీంతో ఈఏడాది మార్చి 14 నుంచి మరో మూడు నెలల పాటు అంటే జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రజల్లో కొద్దిమేర చైతన్యం రాగా, అప్‌డేట్ చేసుకునే వారి సంఖ్య క్రమేపి పెరిగింది. అయితే ఈలోపు గడువు సమీపించడంతో మరో మూడు మాసాలు పెంచుతూ ఈనెల 14వరకు అవకాశం కల్పించింది. అయినా, ఇంకా పదేళ్ల గడువు ముగిసిన వారు భారీ సంఖ్యలోనే ఉండడంతో మరోసారి మార్చి 14 వరకు గడువు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. గడువు ముగిసిన అనంతరం అప్‌డేట్‌తో పాటు ఫొటో, నివాసం, ఇతర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధిగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందని ఆధార్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### ఉచితంగా ఆన్‌లైన్‌లో నమోదు

ఉచితంగా ఆన్‌లైన్ చేసుకునే విధానాన్ని ఒకసారి పరిశీలిస్తే.. ఉడాయ్ పోర్టల్‌లో https://myaadhaar.uidai.gov.in ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టూ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్‌చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వివరాలు స్క్రీన్‌పై వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి, సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్ట్స్ పై క్లిక్ చేయాలి. కిందకు స్క్రోలింగ్ చేస్తే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు.





మీసేవ సెంటర్‌లో అప్‌డేట్ చేసుకుంటున్న ప్రజలు



అలుగునూరు - వరంగల్ రహదారిపై మంచులో వెళ్తున్న పాల వ్యాపారి



మంచుతెరల మధ్య వెళ్తున్న వాహనదారులు



మానేరు డ్యాం కింద మంచులో నీరు తాగుతున్న పక్షి

# మంచు కురిసే కాలం.. బతుకు పయనం

కరీం'నగరం'పై దట్టంగా పొగమంచు కురుస్తున్న సమయంలో ప్రజలు బతుకు ప్రయాణం సాగిస్తున్నారు. తెలతెలవారుతున్న వేళ మంచు తెరలను చీల్చుకుంటూ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ముఖ్యంగా పాల విక్రయదారులు, పేపర్‌బాయ్స్, పారిశుధ్య కార్మికులు, కూరగాయల వ్యాపారులు స్వెట్టర్లు, మంకీక్యాపులు, గ్లౌస్‌లు ధరించి కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున కరీంగనగర్ శివారులోని మానేరు డ్యాం సమీపంలో పలువురు వాహనాలపై వెళ్తూ, ఓ కొంగ మానేరు నీళ్లల్లో ఆహారాన్ని అన్వేషిస్తున్న దృశ్యాలు 'నమస్తే' కెమెరాకు చిక్కాయి.

- కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# జిల్ జిగేల్

**● సెంట్రల్ లైటింగ్‌తో ధర్మారానికి కొత్త శోభ**
**● పూర్తయిన నాలుగు వరుసల బీటీ రోడ్డు**

నాలుగు వరుసల బీటీ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టంతో ధర్మారం మండలం నూతన శోభను సంతరించుకున్నది. మండల కేంద్రంలో పెద్దపల్లి-ధర్మారం ఆర్అండ్‌బీ రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించేందుకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో డీఎంఎఫ్‌టీ పథకం ద్వారా రూ.7కోట్లు మంజూరు కాగా, పనులన్నీ పూర్తికావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. గతేడాది అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రూ.50లక్షలతో నాలుగు వరుసల విస్తరణతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, డివైడర్ నిర్మించారు. అనంతరం కోటి రూపాయలతో మహాత్మాగాంధీ విగ్రహం నుంచి ఏఎంసీ ప్రధాన గేట్ వరకు, రూ.2కోట్లతో ఏఎంసీ కార్యాలయం గేట్ నుంచి ఎస్సారెస్పీ డీ-83 కాలువ వరకు బీటీ రోడ్డును విస్తరించారు. రూ.3.50కోట్లతో అంబేద్కర్ చౌరస్తా నుంచి వడ్డెర కాలనీ వరకు రెండు వైపులా డ్రైనేజీ, బీటీ రోడ్డు, డివైడర్, అలాగే అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు డివైడర్ నిర్మించారు. ఇటీవల డివైడర్ల మధ్య విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో మండల కేంద్రం జిల్ జిగేల్‌మంటూ కళకళలాడుతున్నది.

- ధర్మారం, డిసెంబర్13



అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో వెలుగుతున్న లైట్లు



మహాత్మగాంధీ విగ్రహం నుంచి పూర్తయిన బీటీ రోడ్డు నిర్మాణం



శుద్ధినీటిని తుమ్మల కుంట చెరువులోకి మళ్లించేందుకు నిర్మిస్తున్న ఔట్‌లెట్ పైపులైన్



నిర్మాణంలో ఉన్న క్లోరినేషన్ ట్యాంక్



సిరిసిల్ల పట్టణ శివారులో నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్, పూర్తయిన అడ్మినిస్ట్రేటీవ్ భవనం



నర్సింగ్ కళాశాల పక్కనే మురుగు నీటిని ఎస్‌టీపీ ప్లాంట్‌లోకి మళ్లించేందుకు ఏర్పాటు చేసిన ఐఅండ్‌డీ స్ట్రక్చర్

# సిరిసిల్లకు స్వచ్ఛహారం

**● పట్టణ శివారులోని ఫస్ట్ బైపాస్‌లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్**
**● ఆరెకరాల్లో రూ.61.5 కోట్లతో నిర్మాణం ● 19.3 మిలియన్ లీటర్ల నిల్వ సామర్థ్యం**
**● ఎమ్మెల్యే కేటీఆర్ పర్యవేక్షణలో వేగంగా పనులు**
**● త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు ● తీరనున్న పట్టణ వాసులు. రైతుల ఇబ్బందులు**

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) రాజన్నసిరిసిల్ల ఆవిర్భావం తర్వాత సిరిసిల్ల పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్నది. ఏడు పల్లెలు బల్దియాలో విలీనమయ్యాయి. వస్త్రపరిశ్రమకు కేంద్రబిందువు కావడంతో పెద్దసంఖ్యలో ఇండస్ట్రీలు తరలివస్తున్నాయి. ఒకవైపు ఇండ్ల నుంచి వెలువడే మురుగు నీరు, మరోవైపు పరిశ్రమల నుంచి వచ్చే రంగులు, రసాయనాలతో కూడిన నీటిని కాలువల ద్వారా రామప్పగుట్టల సమీపంలోని తుమ్మల కుంటకు మళ్లిస్తున్నారు. గత జనాభాకు అనుగుణంగా సుమారు 1.50 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ చెరువు ప్రస్తుతం సరిపోవడం లేదు. చెరువు నిండి సమీపంలోని పంట చేలల్లోకి చేరి అక్కడి నుంచి మానేరు వాగులో కలుస్తున్నది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించారు. అంచనాలు రూపొందించి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పంపించాలని బల్దియా అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధ ప్రతిపాదికన అంచనాలు రూపొందించి పంపించగా వెంటనే అప్పటి ప్రభుత్వం ఆమోదించింది. ఫస్ట్ బైపాస్‌రోడ్డు నర్సింగ్ కాలేజీ సమీపంలో ఆరెకరాల స్థలాన్ని కేటాయించింది. 19.3 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఎస్టీపీ నిర్మాణ పనులను 2022 మే నెలలో ప్రారంభించింది. దాదాపు పనులు పూర్తి కాగా, త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే రోజుకు 3.19 మిలియన్ లీటర్ల మురుగునీరును శుద్ధి చేసే అవకాశం ఉంటుంది.

### నిరంతర పర్యవేక్షణ..

2022 మే నెలలో ప్రారంభమైన ఎస్టీపీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగాయి. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ నిరంతరం పర్యవేక్షించారు. సిరిసిల్లకు వచ్చిన ప్రతిసారి అధికారులతో సమీక్షించేవారు. దీంతో అధికారులు చకచకా సాగేలా చర్యలు చేపట్టారు. కేవలం ఏడాదిలోనే ప్లాంట్ పనులు దాదాపు పూర్తి చేశారు. సాధ్యమైనంత త్వరలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తెస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.



పట్టణ నివాసాల నుంచి వచ్చే మురుగు నీటి కోసం బల్దియా ఏర్పాటు చేసిన కాలువ

### ప్రతిరోజూ 3.19 మిలియన్ లీటర్ల నీరుశుద్ధి

వస్త్ర పరిశ్రమకు కేంద్ర బిందువైన సిరిసిల్ల పట్టణ జనాభా 1.10లక్షలుండగా, 22,000 నివాసాలున్నాయి. ఇందులో ముఖ్యంగా మరమగ్గాలు, అద్దకం (డైయింగ్) పరిశ్రమలు, సైజింగ్‌లు, అనుబంధ, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. నివాసాలు, పరిశ్రమల నుంచి 3.19 మిలియన్‌ల మురుగు నీరు రోజు వెలువడుతుంది. ఈ నీటిని శుద్ధి చేయనుండగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 19.3 లీటర్ల నీటిని రీసైక్లింగ్ చేసే సామర్థ్యంతో ప్లాంట్‌ను నిర్మించారు. ఎస్టీపీ ప్లాంట్‌కు వంద మీటర్ల దూరంలోని డ్రైనేజీకి ఇన్‌లెట్ చాంబర్ (ఐఅండ్‌డీ) స్ట్రక్చర్‌ని ఏర్పాటు చేస్తున్నారు. మురుగునీరులో వచ్చే చెత్తా చెదారం జాలి వద్ద ఆగిపోతుంది. నీటిని రాసీలెజ్ సంపులోకి మళ్లిస్తారు. అందుకు 33 ఫీట్ల లోతు, సుమారు వంద ఫీట్ల వెడల్పుతో పెద్ద బావి (సంపు) నిర్మించారు. ఇందులో 195 హెచ్‌పీ సామర్థ్యం గల మోటరు 1, 45 హెచ్‌పీల సామర్థ్యం గల 4 మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. మురుగునీటిలోని బ్యాక్టీరియాను తొలగిస్తారు. క్లోరినేషన్ కాంటాక్ట్ ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేసి, ఔట్‌లెట్ పైపులైన్ ద్వారా తుమ్మల కుంట చెరువులోకి మళ్లిస్తారు. పంట చేలకు, ఇతర అవసరాలకు ఈనీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్లాంట్ నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతను పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. పనులను హైదరాబాద్ ఉన్నతాధికారుల బృందం ఎప్పటికప్పుడూ పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నది. యంత్రాలు అమర్చి ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.



మల్లాపూర్‌లోని గాంధీనగర్ కాలనీలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



సఫాయి కార్మికులతో మాట్లాడుతూ..



దుర్గమ్మ కాలనీలో డ్రైనేజీ పరిశీలిస్తూ..

# మన ఊరికి-మన ఎమ్మెల్యే

మల్లాపూర్, డిసెంబర్ 13 : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ప్రజా సమస్యల పరిష్కారం కోసం సరికొత్తగా 'మన ఊరికి-మన ఎమ్మెల్యే' కార్యక్రమం చేపట్టారు. బుధవారం వేకువ జామున అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ కాలనీ, గాంధీనగర్‌లోని ఇంటింటా తిరుగుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ఏజెండా అని, నిత్యం ఉదయం వేళలో గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీల్లో తాగునీటి సమస్య, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్వయంగా ఎమ్మెల్యేనే తమ ఇంటికి వచ్చిన సమస్యలు అడిగి తెలుసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపల్లి సరోజన, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, డీఈ ఆనంద్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీడీవో జగదీశ్, ఏఈలు నిరంజన్, రాకేశ్, నిఖిల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



అయ్యప్ప దీక్షాపరులకు భోజనం వడ్డిస్తున్న ఎండీ మహబూబ్ ఖాన్



పాల్గొన్న అయ్యప్ప దీక్షాపరులు

# వెల్లివిరిసిన మతసామరస్యం

**అయ్యప్ప దీక్షాపరులకు ముస్లిం యువకుడి భిక్ష**

మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటలో మత సామరస్యం వెల్లివిరిసింది. గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ఎండీ మహబూబ్‌ఖాన్ బుధవారం అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. కొన్నేండ్లుగా అయ్యప్పస్వాములకు అన్నదానం చేస్తూ మతసామరస్యాన్ని చాటిన యువకుడిని గ్రామస్తులు అభినందించారు. - మల్లాపూర్, డిసెంబర్ 13